ఆంధ్రజ్యోతి

5 ANDHRAJYOTHY అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

బుధవారం 3 ఏప్రిల్ 2024

మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

పాడేరురూరల్, ఏప్రిల్ 2: జిల్లాలో మే ఒకటో తేదీ నుంచి 50 ఉచిత వేసవి క్రీడా శిబిరాలను ప్రారంభించనున్నామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. గ్రామీణ, మేజర్ పంచాయతీలు, మండల, జిల్లా కేంద్రాల్లో ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. శిబిరాల నిర్వహణకు క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాయామోపాధ్యాయులు, కోచ్‌లు ఈ నెల 5న దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిబిరాల్లో 8 నుంచి 14 సంవత్సరాల వయసు కలిగిన బాల, బాలికలకు శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9000274225 నంబరులో సంప్రదించాలని కోరారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

అధికారులకు కలెక్టర్ విజయసునీత ఆదేశం



పాడేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ ఎం.విజయసునీత అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళితో కలిసి మంగళవారం మండలస్థాయి అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వృద్ధులు, కదలలేని వారు, సచివాలయానికి దూరంగా ఉన్న గ్రామాల్లోని వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించాలన్నారు. శతశాతం పింఛన్ల పంపిణీ జరిగే వరకు సచివాలయాల సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు విధుల్లో ఉండాలన్నారు. మూడు నాలుగు రోజుల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

అరకు ఆర్‌ఐటీఐలో జాబ్ మేళా రేపు

అరకులోయ, ఏప్రిల్ 2: అరకు ఆర్‌ఐటీఐలో ఈ నెల 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎల్‌అండ్‌టీ సంస్థ ఎలక్ట్రీషియన్ 200, వెల్డర్ 100, సివిల్ 100, ఫిట్టర్ 100, పదో తరగతి, ఇంటర్ పాసైన అభ్యర్థులకు 100 పోస్టులు భర్తీ చేయనుందన్నారు. ఆయా ట్రేడ్స్‌లో శిక్షణ పొందిన వారంతా నాలుగో తేదీ ఉదయం పదిగంటలకు అరకు ఆర్‌ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.18 వేలు జీతం, ఉచిత వసతి, భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు టెక్నికల్ ఐటీఐ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఒరిజినల్స్‌తో పాటు ఒక సెట్ జెరాక్స్, లేటెస్ట్ పాస్‌పోర్టుసైజ్ ఫొటో తీసుకురావాలన్నారు.

ఏవోబీలో ఎన్ కౌంటర్

» అప్రమత్తమైన పోలీసులు

కొయ్యూరు, మార్చి 2: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ఛత్తీస్‌గఢ్ కర్రేలి అటవీ ప్రాంతంలో భారీ ఎన్ కౌంటర్ జరిగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీజాపూర్ జిల్లా కర్రేలి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో గంగులూరు ఏరియా కమిటీ మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురు కాల్పులలో ఎనిమిది ... మిగతా 8వ పేజీలో

అటు వృథా.. ఇటు వ్యథ!

నిర్మాణాలను గాలికి వదిలేసిన అధికారులు

» అవసరమైన చోట నిధులు లేక ఇబ్బందులు
» నీడలేక అంగన్‌వాడీ చిన్నారుల అవస్థలు
» ఏజెన్సీలో భవన నిర్మాణాల పరిస్థితి

ప్రజాధనం అంటే లెక్కలేని తనం నెలకొంది. దీంతో అవసరమైన చోట భవన నిర్మాణాలకు నిధులివ్వని సర్కారు... మరో వైపు పూర్తయ్యే దశలో ఉన్న భవనాలను పట్టించుకోకుండా కొత్త భవనాలకు నిధులు మంజూరు చేస్తోంది. మన్యంలో ఇలాంటి పరిస్థితులు స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొయ్యూరు మండలంలోని రెండు గ్రామాల్లో పంచాయతీలకు రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించగా, వాటిని గాలికి వదిలేశారు. మరోవైపు గూడెం కొత్తవీధి మండలంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి నిధులు లేక మధ్యలోనే వదిలేశారు.

కొయ్యూరు, ఏప్రిల్ 2:
ప్రజా దనం వెచ్చించి నిర్మించిన భవనాలు వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలోని కంఠారం, మంప పంచాయతీల్లో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన భవనాలు ఐదేళ్లుగా వృథాగా దర్శనమిస్తున్నాయి. గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణాలు ప్రారంభించారు. తుది మెరుగులుదిద్దాల్సి ఉంది. వీటిని వినియోగంలోకి తెచ్చేలోగా ప్రభుత్వం మారడం, వైసీపీ అధికారంలోకి రావడంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. దీంతో పంచాయతీ భవనాన్ని ఇంజనీరింగ్ అధికారులు గాలికి వదిలేశారు. మంపలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాలు సచివాలయానికి వీలుగా తీర్చిదిద్దే అవకాశమున్నా పట్టించుకోలేదు. నూతన భవన నిర్మాణాలు పూర్తయ్యేవరకు రూ.వేలు అద్దె చెల్లించి పరాయి పంచన నడిపేందుకూ ప్రభుత్వం మొగ్గు చూపింది. దీంతో రూ.లక్షల్లో ప్రజా దనం వృథా అయింది.

ఈ అంశంపై భవన నిర్మాణ పనులు పర్యవేక్షించిన ఇంజనీరింగ్ సిబ్బందిని ప్రశ్నించగా నిర్మాణాల మేరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవటంతో నిలిచిపోయాయయన్నారు. ఇదిలా ఉండగా కంఠారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక ఐటీడీఏ నిధులు రూ.20 లక్షలు వెచ్చించి పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రం ... మిగతా 8వ పేజీలో



కంఠారం గ్రామంలో పీహెచ్‌సీ వెనుక నిర్మాణం పూర్తై నిరుపయోగంగా ఉన్న ఏఎన్‌ఎం సబ్‌సెంటర్ భవనం

చిన్నారులకు అవస్థలు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 2:
నాడు నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించాం. ఈ పథకం కొత్త ఒరవడిని సృష్టించిందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే చెబుతుంటారు. స్థానిక ... మిగతా 8వ పేజీలో



అసంపూర్తిగా దర్శనమిస్తున్న పెదగ్రహారం నూతన అంగన్‌వాడీ భవనం



గ్రామంలోని ఓ గృహం వరండాలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పాడేరు రాజకీయం విభిన్నం

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలకు దక్కని టికెట్‌లు

ప్రచారానికే పరిమితం కానున్న నేతలు



కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



గిడ్డి ఈశ్వరి

(పాడేరు, ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రం పాడేరు అసెంబ్లీ స్థానంలో విభిన్నమైన పరిస్థితి నెలకొంది. అధికార వైసీపీకి చెందిన ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఈసారి టికెట్‌లు లభించలేదు. దీంతో ఈ అంశంపైనే ప్రస్తుతం జిల్లాలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మికి అసెంబ్లీ టికెట్ దక్కనప్పటికీ, అరకులోయ ఎంపీ టికెట్ దక్కుతుందని అందరూ భావించారు. పాడేరు అసెంబ్లీ స్థానం సమన్వయకర్తగా ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమించిన సందర్భంగా భాగ్యలక్ష్మికి అరకులోయ ఎంపీ స్థానం సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. అప్పటికే ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా వైసీపీ అధ్యక్షురాలుగా ఉండడంతో ఎంపీ స్థానంలో బరిలోకి దిగితే పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని భావించారు. ఈ తరుణంలో అనుహ్యంగా అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోడలు డాక్టర్ జి.తనూజారాణికి అరకులోయ ఎంపీ టికెట్ ప్రకటించారు. దీంతో సిటింగ్ ఎమ్మెల్యే అయినప్పటికీ భాగ్యలక్ష్మి తాజా ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

టీడీపీ ఇన్‌చార్జి అయినా...

తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి అయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఎమ్మెల్యే టికెట్ లభించలేదు. పార్టీలోనే అసమ్మతివర్గం, టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీలో చేరిన రమేశ్‌నాయుడు మరో వర్గంగా టికెట్‌కు ప్రయత్నాలు చేశారు. ఈక్రమంలో గిడ్డి ఈశ్వరి లేదా ఎంవీవీ ప్రసాద్, కొట్టగుల్లి సుబ్బారావుల్లో ఒకరికి టికెట్ దక్కుతుందని ప్రచారం జరిగింది. అయితే అనుహ్యంగా రమేశ్ నాయుడుకి టీడీపీ టికెట్ ప్రకటించారు. దీంతో ఇన్నాళ్లు నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించిన గిడ్డి ఈశ్వరికి భంగపాటు తప్పలేదు. పాడేరులో అధికార వైసీపీకి చెందిన ఎమ్మెల్యే, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేల పరిస్థితి ఒకేలా ఉండడం విశేషం.

మాచ్‌ఖండ్ రికార్డు

లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి

» 626 మిలియన్ యూనిట్లకు 863.45 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
» సామర్థ్యం 150 మెగావాట్లకు పెంచేందుకు చర్యలు
» సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్



బి శ్రీధర్ చీఫ్ ఇంజనీర్

సీలేరు, ఏప్రిల్ 2:
సీలేరు కాంప్లెక్సు పరిధిలోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది లక్ష్యాన్ని మించి విద్యుదుత్పత్తి జరిగిందని ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూఏటా కేంద్ర విద్యుత్ అథారిటీ జలాశయాల నీటి నిల్వల ఆధారంగా విద్యుదుత్పత్తి లక్ష్యాలను నిర్దేశిస్తుందని 2023-24 ఆర్థిక సంవత్సరానికి మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి 626 మిలియన్ యూనిట్లు, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి 1,084 మిలియన్ యూనిట్లు, డొంకరాయి కేంద్రానికి 99.4 మిలియన్ యూనిట్లు, సీలేరు కేంద్రానికి 470 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. అయితే మాచ్ ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు 626 మిలియన్ యూనిట్ల లక్ష్యానికి గాను 863.45 మిలియన్ యూనిట్లు అంటే 237.45 మిలియన్ యూనిట్లు లక్ష్యాన్ని మించి విద్యుదుత్పత్తి జరిగిందన్నారు. పొల్లూరు కేంద్రానికి 1084 మిలియన్ యూనిట్లు లక్ష్యం కాగా 1003.599 మిలియన్ యూనిట్లు (92.58) శాతం, డొంకరాయి కేంద్రంకు లక్ష్యం 99.4 మిలియన్ యూనిట్లకు 79.104 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి (79.87 శాతం) జరిగిందన్నారు, సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి 470 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించగా 361.6615 మిలియన్ యూనిట్ల (76.95 శాతం) శాతం చేరారన్నారు. జలవిద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకే ఉత్పత్తి జరుగుతుందని, ఈ ఏడాది సీలేరు కాంప్లెక్సులోని కేంద్రాలకు నీటిని సరఫరా చేసే బలిమెల జలాశయం పరీవాహక ప్రాంతంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదల, వేసవిలో రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడం కోసం ఫిబ్రవరి 7 నుంచి మార్చి 10 వరకు సీలేరు, డొంకరాయి, పొల్లూరు కేంద్రాలో ఉత్పత్తిని నిలిపివేయాల్సి రావడంతో లక్ష్యాలు చేరుకోలేదన్నారు.

మాచ్‌ఖండ్ సామర్థ్యం పెంపునకు చర్యలు

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం సామర్థ్యం నుంచి 120 మెగావాట్ల నుంచి 150 మెగావాట్లకు పెంచేందుకు జెన్‌కో, ఒడిశా ఏహెచ్‌పీసీ అధికారుల ఆదేశా మేరకు కేంద్రంలోని ఆరు యూనిట్లకు గాను 5 యూనిట్లకు ఆర్‌ఎల్‌ఏ స్టడీ నిర్వహించామన్నారు. ఆధునిక యంత్రాలను అమర్చి సామర్థ్యం పెంపునకు సిదం చేస్తామన్నారు.

శరవేగంగా పొల్లూరు పనులు

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో 115 మెగావాట్ల సామర్థ్యం గల 5,6 యూనిట్ల పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఈ పనులకు రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. పెన్‌స్టా పైపులైన్‌కు సంబంధించిన పైపుల బెండింగ్, ఎరక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయని సీఈ శ్రీధర్ తెలిపారు. పొల్లూరులో రెండు యూనిట్లు వినియోగంలోకి వస్తే సీలేరు కాంప్లెక్సు ఖాతాలో అదనంగా 230 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేరుతుందన్నారు.

పంత్ X శ్రేయాస్

నేడు ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య మ్యాచ్

» వరుస విజయాల ఊపుమీదున్న కోల్‌కతా
» సీఎస్‌కేపై సాధించిన విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో ఆత్మవిశ్వాసం
» ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి





నెట్ ప్రాక్టీస్‌లో శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 2:
నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్లు తలపడనున్నాయి. ఈ సీజన్‌లో రెండు మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్-ఆదివారం ఇక్కడ బలమైన చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. ఢిల్లీ క్యాపిటల్స్ జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో, ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓటమి పాలైనా, హోమ్ గ్రౌండ్‌లో సీఎస్‌కేపై విజయం సాధించడంతో ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. జట్టులో టాప్ ఆర్డర్ డేవిడ్ వార్నర్, పృథ్వీషా, కెప్టెన్ రిషబ్ పంత్, మిచెల్ మార్ష్ ఫామ్‌లో ఉన్నారు. ఇప్పటికే వరుసగా రెండు విజయాలతో జోరు మీద ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్‌పై కూడా విజయం సాధించాలని ఢిల్లీ క్యాపిటల్స్ భావిస్తోంది.

మరోవైపు బలమైన రాయల్ చాలెంజర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లపై వరుస ... మిగతా 8వ పేజీలో

ముసుగు తొలగింది



ఎన్నికల్లో వైసీపీ తరపున పనిచేసేందుకు సిద్ధమైన పలువురు వలంటీర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

» మూకుమ్మడిగా రాజీనామాలు
» అధికారుల కంటే ముందు అధికార పార్టీ నేతల ఎదుట రాజీనామా లేఖల ప్రదర్శన
» జగన్ రుణం తీర్చుకుంటామని నినాదాలు
» నెలకు రూ.15 వేలు ఇస్తామంటూ నేతల ఆఫర్
» అధికారంలోకి వస్తే మళ్లీ తీసుకుంటామని హామీ

ఎన్నికలు సమీపించేసరికి గ్రామ, వార్డు వలంటీర్లు రాజకీయ ముసుగు తొలగించి, అసలు స్వరూపం బయటపెడుతున్నారు. పింఛన్ల పంపిణీకి దూరంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం చెప్పడంతో స్థానిక రాజకీయ నేతల ఒత్తిళ్లలో మూకుమ్మడిగా ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో పెందుర్తి మండలంలో 30 మంది, పరవాడ మండలం తానాంలో 23 మంది రాజీనామా చేశారు. అలాగే అనకాపల్లి జిల్లా కశింకోట పంచాయతీలో అయితే ఏకంగా 89 మంది వలంటీర్లు రాజీనామాలు సమర్పించారు. అదే మండలం బయ్యవరంలో మరో 14 మంది రాజీనామా చేశారు. వీటి వెనుక వైసీపీ నేతల ప్రోద్బలం ఉందనేది సుస్పష్టం. తానాంలో రాజీనామా చేసిన వలంటీర్లు అక్కడి జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిశారు. తమ రాజీనామా పత్రాలను ప్రదర్శిస్తూ 'జై జగన్...జైజై అదీప్ రాజు...' అంటూ నినాదాలు చేశారు. జగన్ రుణం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ కూడా చేయించారు.

ఇన్నాళ్లూ వలంటీర్లు స్వచ్ఛంద సేవకులని వైసీపీ పెద్దలు చెప్పుకొచ్చారు. కేవలం రూ.5 వేల గౌరవ వేతనానికే పనిచేస్తున్నారని వారిని ప్రశంసించారు. కానీ పార్టీ కోసం పనిచేసేలా వారికి శిక్షణ ఇచ్చారు. వారి ద్వారానే గ్రామాలు, వార్డుల్లో ఓటర్ల వివరాలు తీసుకోవడం, ఓటర్లకు కానుకలు పంపిణీ చేయడం చేశారు. నగరంలో కార్పొరేటర్లు, గ్రామాల్లో ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు వారిని (వలంటీర్లను) పార్టీ క్రియాశీలక కార్యకర్తల్లా భావిస్తున్నారు.

ప్రస్తుతం ఎన్నికల సంఘం ఆంక్షలు విధించిన నేపథ్యంలో నాయకులు ఎక్కడికక్కడే సమావేశాలు నిర్వహించి, వలంటీరు పోస్టుకు రాజీనామాలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. అలా చేస్తే నెలకు రూ.15 వేలు వరకు ఇస్తామని ఆశ చూపుతున్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే అందరినీ వలంటీర్లుగా తీసుకుంటామని భరోసా ఇస్తున్నారు. ఈ మూడు నెలలు పార్టీకి పనిచేయాలని, ఏ అధికారి ఏమీ అనకుండా తాము చూసుకుంటామని హామీ ఇచ్చారు. తమ చేతులు మీదుగానే నియమించిన వలంటీర్లను ఆయా నాయకులు రెండు రోజుల నుంచి ఇళ్లకు పిలిచి మూకుమ్మడిగా రాజీనామాలు చేయిస్తున్నారు. ఇది గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా ఉంది. రాజీనామాకు కారణం ఏమి రాశారు? అనే విషయాన్ని అధికారులు వెల్లడించడం లేదు. అధికార పార్టీకి భయపడి ఆ పత్రాలను బయటపెట్టడం లేదు. పోస్టులకు ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.14
సహరి (గురు)	4.36

సెక్టార్ అధికారులకే కీలక బాధ్యత

» ఎన్నికలు సజావుగా నిర్వహించాలి : కలెక్టర్




మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత, పక్కన ఆర్‌వోలు, డీఆర్‌వో

పాడేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేసే బాధ్యత సెక్టార్ అధికారులపైనే ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులు, నియోజవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన మూడో విడత శిక్షణలో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్‌కు ముందు, అనంతరం సెక్టార్ అధికారులు సమర్థంగా పనిచేయాలన్నారు. పోలింగ్ రోజు ఈవీఎంల నిర్వహణ, అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు చేరవేయాల్సిన బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి లోటుపాట్లుంటే తక్షణమే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించి, సరిచేయాలన్నారు. పోలింగ్ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో సుమారు ఎనిమిది పోలింగ్ కేంద్రాలుంటాయని ప్రతి పోలింగ్ కేంద్రం, రూట్‌లపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం వివరాలు, పోలింగ్ జరుగుతున్న తీరుపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించడం, పోలింగ్ అనంతరం ప్రణాకాబద్ధంగా ఈవీఎంలు, పోలింగ్ పార్టీలు తిరిగి వచ్చేలా చూసుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓటింగ్ శాతం పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, అరకులోయ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వీవీఎస్ శర్మ, పి.అంబేడ్కర్, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా విడుదల

» ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆరు స్థానాలకు అభ్యర్థులు ప్రకటన



బుల్లిబాబు (పాడేరు)



గంగాధర్ (అనకాపల్లి)

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):
సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయబోయే అభ్యర్థుల తొలి జాబితాను అధిష్ఠానం మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఆరు స్థానాలు ఉన్నాయి. విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి గుత్తుల శ్రీనివాస రావు, పెందుర్తి నియోజకవర్గం నుంచి పిరిడి భగత్, పాయకరావుపేట (ఎస్సీ) నియోజక వర్గం నుంచి బోని తాతారావు, అనకాపల్లి నియోజకవర్గం నుంచి ఇళ్ల రామ గంగాధర రావు, మాడుగుల నియోజకవర్గం నుంచి బీబీఎస్ శ్రీనివాసరావు, పాడేరు నియోజకవర్గం నుంచి సతిక బుల్లిబాబు పోటీ చేయనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని మిగిలిన తొమ్మిది అసెంబ్లీ, మూడు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఈ నెల ఎనిమిదో తేదీన ఖరారు చేయనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

క్రైం... crime news

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

గొలుగొండ, ఏప్రిల్ 2 : తాండవ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తూ బోటు బోల్తా పడడంతో గల్లంతైన మత్యకారుడు గరగల అప్పారావు మృతదేహం మంగళవారం లభించింది.రిజర్వాయర్‌లో రెండు రోజుల క్రితం సాలికమల్లవరం పంచాయతీ శివారు పొగచెట్లపాలెం గ్రామానికి చెందిన అప్పారావు, మరో వ్యక్తి రొయ్యల వేట సాగిస్తుండగా ప్రమాదవశాత్తూ బోటు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అప్పారావు రిజర్వాయర్‌లో పడి గల్లంతు కాగా, మరో వ్యక్తిని స్థానికులు రక్షించారు. అప్పారావు మృతదేహం కోసం రెండు రోజులుగా ఎస్‌ఐ కృష్ణారావు, నర్సీపట్నం రూరల్ సీఐ హరి, రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రిజర్వాయర్ మధ్యలో మృతదేహాన్ని మత్స్యకారులు గుర్తించి, రిజర్వాయర్ ఒడ్డుకు చేర్చారు.రిజర్వాయర్ వద్ద పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

లంకెలపాలెం, ఏప్రిల్ 2: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మంత్రిపాలెం జెఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయానికి సమీపంలో మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకొంది. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాదీబ్ (52) స్థానిక జెఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలో నివాసం ఉంటూ ఫార్మాసిటీలో పనిచేస్తున్నాడు. విధులకు వెళ్లేందుకు నడుచుకొని ప్రధాన రహదారి దాటుతుండగా కన్నూరు నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. దీంతో సాదీబ్ తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ బాలసూర్యారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- అవయవాలు దానం చేసిన కుటుంబీకులు

ఎలమంచిలి, ఏప్రిల్ 2 : మండలంలోని పులపర్తి జంక్షన్ సమీపంలో హైవేపై గత నెల 29న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేఎస్‌వీ కృష్ణ మంగళవారం మృతి చెందినట్టు రూరల్ ఎస్సై సింహాచలం తెలిపారు. జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రమాదానికి గురయ్యారు. ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా గాయపడిన ఇద్దరినీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందారు. అతను విశాఖలోని వైబవ్ జ్యూయలర్స్ ప్రధాన బ్రాంచిలో పనిచేస్తుంటారని ఎస్సై తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయిన కృష్ణ బంధువులు విశాఖలో అవయదానం చేసేందుకు ముందుకు వచ్చినట్టు చెప్పారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నక్కపల్లి, ఏప్రిల్ 2: స్థానిక వారపు సంత సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఆటో, బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నక్కపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సచివాలయం సెక్రటరీగా పనిచేస్తున్న కర్రి శ్రీను బైక్‌పై నక్కపల్లి నుంచి అడ్డరోడ్డు వైపు వెళుతుండగా ఆగి వున్న ఆటోను ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వేరే ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 43 పశువుల పట్టివేత

ఎలమంచిలి, ఏప్రిల్ 2 : కంటైనర్‌లో అనధికారికంగా తరలిస్తున్న 43 పశువులను పట్టుకుని విశాఖలోని గోశాలకు తరలించినట్టు రూరల్ ఎస్సై సింహాచలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారిపై మంగళవారం అనుమానాస్పదంగా ఉన్న కంటైనర్‌ను పోలీసులు తనిఖీ చేయగా అందులో సుమారు 43 పశువులు ఉన్నట్టు గుర్తించారు. పశువుల తరలింపునకు సంబంధించి డ్రైవర్ వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేశారు. వీటిని ఒడిశాలోని నవరంగాబాద్ నుంచి అనంతపురంజిల్లాలోని హిందుపురం సంతకు తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. పట్టుకున్న పశువులను విశాఖలోని జ్ఞానానంద గోశాలకు తరలించారు. కంటైనర్‌ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

నక్కపల్లిలో 65 గోవులు..

నక్కపల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్ సమీపంలో కబేళాకు గోవులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు డీఎస్పీ మోహన్, నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ సిబ్బందితో వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈమేరకు కంటైనర్‌ను తనిఖీ చేయగా అందులో 65 గోవులున్నట్టు గుర్తించారు. కంటైనర్‌ను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామని, గోవులను సురక్షితంగా పలు ప్రాంతాల్లోని గోశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని సీఐ చెప్పారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2: పట్టణంలోని దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి వెళ్తున్న వ్యక్తిని సుంకరమెట్ట జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం... కొత్తూరు నరసింగరావుపేటకు చెందిన గొన్నాబత్తుల జయ సంతోష్ పట్టణంలోని పలు దుకా ణాల్లో 11 మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి బ్యాగ్‌లో తీసుకెళ్తుండగా పోలీసులు అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఈమేరకు 11 బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

విద్యార్థిని ఆత్మహత్య కేసులో ఐదుగురు అరెస్టు

- లైంగిక వేధింపులు జరిగినట్లు నిర్ధారణ : డీసీపీ మణికంఠ

మహారాణిపేట, ఏప్రిల్ 2 : మధురవాడలోని చైతన్య పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీసీపీ వీఎన్ మణికంఠ తెలిపారు. మంగళవారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. మార్చి 28 వ తేదీన మధురవాడ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి కాలేజీలో జరిగిన లైంగిక వేధింపులపై తండ్రి సెల్ ఫోన్‌కు మెజేజ్ ద్వారా తెలియపరచి కళాశాల మేడ మీద నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదుచేసి విచారించిన పోలీసులు కాలేజీలో లైంగిక వేధింపులు జరిగినట్లు నిర్ధారించారు. కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్న నూనెల శంకరరావు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. ఈ కేసులో కళాశాల యాజమాన్యం నుంచి శంకర్ వర్మ, డిప్లొమో కాలేజీ ప్రిన్సిపాల్ జీ భానుప్రవీణ్, హాస్టల్ వార్డెన్ వంటపతి ఉషారాణి, ఆమె భర్త ప్రదీప్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు డీసీపీ తెలిపారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న అనకాపల్లి మెయిన్ రోడ్డు

అనకాపల్లి టౌన్/కోటవురట్ల, ఏప్రిల్ 2 : అనకాపల్లిలో ఉష్ణోగ్రతలు రోజురోజుకి పెరుగుతున్నాయి. మూడు రోజులుగా ఎండలకు తోడు వేడిగాడ్పులు వీస్తుండడంతో ప్రజలు ఉదయం 11 గంటల తరువాత ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. అనకాపల్లిలో ఆది, సోమవారం అత్యధిక ఉష్ణోగ్రత 36.8 డిగ్రీలు నమోదు కాగా మంగళవారం 37.0 డిగ్రీలకు పెరిగింది. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పట్టణంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. కోటవురట్లలోనూ 36.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	113.00
లైవ్ ధర	133.00
విత్ స్కిన్	236.00
స్కిన్ లెస్	246.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం, భయం కూడదు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



శిక్షణలో మట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, తదితరులు

అనకాపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలలో అధికారులు, సిబ్బంది ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మస్థైర్యంతో, నిబద్ధతతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు.కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనీల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ భయం లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు శిక్షణ దోహదపడాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులకు విధులపై శతశాతం నమ్మకం, నిబద్ధత కలుగజేయాలని సూచించారు. చెక్‌లిస్ట్ తీసుకోవడం, తిరిగి అప్పగించడం, మాక్ ఓటింగ్‌తో పాటు పోలింగ్ ప్రారంభానికి ముందు, ముగిసిన తరువాత ఏంచేయాలో క్షుణ్ణంగా అవగాహన కల్పించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం తనిఖీ చేసి చూపించడం, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు తెలియజేయడంపై తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎటువంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలింగ్ ప్రారంభమైన తరువాత ఎక్కువ మంది వుంటే ఏవిధంగా నియంత్రించవచ్చు, దివ్యాంగుల ఓటింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. వివిధ రకాల ఓట్లను ఏవిధంగా నిర్వహించాలో విపులంగా చెప్పాలన్నారు.అనంతరం అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ పోలింగ్ శిక్షణ విధివిధానాలను మాస్టర్ ట్రైనీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల డీఎం జయంతి, డీఎల్‌డీఓ నాగమణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి. రామ్మూర్తి, అన్ని మండలాల నుంచి 52 మంది మాస్టర్ ట్రైనీలు హాజరయ్యారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

- బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్
- 'పేట'లో టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్

పాయకరావుపేట, ఏప్రిల్ 2 : వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించి, ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. మంగళవారం పాయకరావుపేటలో నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి పక్కనపెట్టి అరాచక పాలన సాగిందన్నారు. ఆ పార్టీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల కష్టాలను పట్టించుకోలేదని విమర్శించారు. ఏడాదికో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి యువతను మోసం చేశారన్నారు. పలుమార్లు ప్రధానిని కలిసిన జగన్ ఏనాడూ రాష్ట్ర ప్రయోజనాల కోసం అడిగిన సందర్భాలు లేవన్నారు. జగన్ రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని బీజేపీ గుర్తించిందని,అందుకే రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలకు మద్దతు ఇచ్చిందని చెప్పారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం ట్రిబుల్ ఇంజన్ స్పీడ్‌తో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితను ఓడించేందుకు వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా..అడ్డుకుంటామన్నారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు వంగలపూడి అనిత మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా సీఎం.రమేశ్‌ని గెలిపించేందుకు మూడు పార్టీల శ్రేణులు కృషిచేయాలని కోరారు. అంతకుముందు జాతీయ రహదారి మీదుగా భారీ ర్యాలీగా పాయకరావుపేట వచ్చిన సీఎం రమేశ్‌కి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పూల వర్షం, గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్దా నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.రవిరాజుతోపాటు నాలుగు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాల పేరుతో జగన్ మోసం

- విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల మావోయిస్టు కమిటీ కార్యదర్శి అరుణ
- బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని పిలుపు

జి.మాడుగుల (అల్లూరి సీతారామ రాజు జిల్లా), ఏప్రిల్ 2: గత ఎన్నికల ముందు ఓట్ల కోసం నవరత్నాల పేరుతో వైసీపీ ప్రజలకు మోసం చేసిందని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి (వీఏఏ) జిల్లాల మావోయిస్టు కమిటీ కార్యదర్శి అరుణ ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆమె పేరుతో మంగళవారం స్థానిక విలేకరులకు లేఖ అందింది. జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామన్న హామీలు ఏమయ్యాయని లేఖలో ఆమె ప్రశ్నించారు. జీవో నంబరు-3 రద్దు నేపథ్యంలో ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. మరీ ముఖ్యంగా వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి జీవో నంబరు-97 రద్దు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని, తీరా అధికారంలోకి వచ్చాక 89 జీవోను ముందుకుతెచ్చి బినామీ పేర్లతో బాక్సైట్ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని లేఖలో ఆమె పిలుపునిచ్చారు. అధికార వైసీపీతో పాటు మిగిలిన బూర్జువా పార్టీలు సైతం అధికారం కోసం కుమ్ములాటలు, పార్టీల ఫిరాయింపులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. అవకాశవాద కూటములు, బ్లాక్‌మెయిలింగ్ పద్ధతులు, కుల, మతాల సమీకరణాలకు పూనుకుంటున్నాయని, ఇందులో భాగంగానే ఆచరణ సాధ్యంకాని హామీలతో మరోసారి మోసాలకు నాయకులు పాల్పడుతున్నారని మావోయిస్టు నేత అరుణ లేఖలో ఆరోపించారు.

ఎంపీ సీటు ఆఫర్ చేసిన వైసీపీ

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయ విజయ్



విలేకరులతో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

నర్సీపట్నం, ఏప్రిల్ 2: తనను ఎంపీగా పోటీ చేయమని వైసీపీ నుంచి ఆఫర్ వచ్చిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేఖరులతో మాట్లాడారు. 2019లో మిథున్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి వైసీపీ తరపున ఎంపీగా పోటీ చేయమని అడిగారని, ఇప్పుడు కూడా సీఎం ముఖ్య సలహాదారు ఒకరు తనకు ఫోన్ చేసి అడిగారని చెప్పారు. టీడీపీలోనే ఉంటానని చెప్పి, తిరస్కరించానన్నారు. సిటీ క్లబ్‌లో అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి, శిలాఫలకంపై పేరు వేయించుకోవడానికి ఎమ్మెల్యే గణేశ్‌కి సిగ్గుండాలని విమర్శించారు. సిటీ క్లబ్ షాపులకు మునిసిపాలిటీ ప్లాన్ ఎక్కడుందని ప్రశ్నించారు. నర్సీపట్నంలో చేసిన అభివృద్ధి గురించి మాట్లాడకుండా సీనియర్ నాయకుడు అయ్యన్నపాత్రుడుని ఉద్దేశించి ఎమ్మెల్యే ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని, గొలుగొండ మండలం ఆరిలోక రోడ్డు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఆ రోడ్డు నిర్మాణానికి అయ్యన్నపాత్రుడే నిధులు తెచ్చారని గుర్తు చేశారు. ఓటు హక్కు లేని వారికి కండువాలు వేసి పార్టీలో చేరినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రూ. 7 లక్షలు పెట్టి తాండవ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతు చేయించలేకపోయారన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాలికమల్లవరంలో తవ్వించిన రంగురాళ్లపై విచారణ చేయిస్తామని చెప్పారు.



ఆందోళన చేస్తున్న హాస్టల్ విద్యార్థినులు

ఏయూలో హాస్టల్ విద్యార్థినుల ఆందోళన

భోజనంలో పురుగులు వస్తున్నాయని ఆరోపణ

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భోజనంలో పురుగులు ఉంటున్నాయని, మెస్ చార్జీలు నిర్ణీత మొత్తం కంటే అదనంగా వసూలు చేస్తున్నారంటూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థినులు మంగళవారం సాయంత్రం ఆందోళనకు దిగారు.వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌ను కలిసి తమ ఇబ్బందులను చెప్పుకునేందుకు వచ్చిన విద్యార్థినులను సెక్యూరిటీ సిబ్బంది లోపలకు అనుమతించకపోవడంతో పక్కనే ఉన్న గాంధీ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వీసీ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. ఏటా హాస్టల్‌కు రూ.4,250 వసూలు చేస్తున్నారని, అది కాకుండా ప్రతి నెలా కనీసం వేయి వరకు అదనపు చార్జీల పేరుతో వసూలు చేస్తున్నారని విద్యార్థినులు వాపోయారు. విద్యుత్ చార్జీలను తమతోనే కట్టిస్తున్నారని, హాస్టల్‌లో ఒక్కో రూమ్‌లో నలుగురు విద్యార్థులు ఉంటే ఒక్కొక్కరి నుంచి రూ.300 చొప్పున కరెంట్ బిల్లు కింద వసూలు చేస్తున్నారని విద్యార్థినులు వాపోయారు. భోజనంలో పురుగులు వస్తున్నాయని, దీనిపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. నీటి కొళాయిలు (ట్యాప్‌లు) 12 ఉంటే నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. గతంలో ఏడాదికి రూ.4,250 ఉన్న ఫీజును ప్రస్తుతం రూ.8 వేలకు పెంచారన్నారు. అదనంగా చెల్లించే మొత్తానికి బిల్లులు ఇవ్వడం లేదని, దీనిపై వార్డెన్‌ను అడుగుతున్నా స్పందించడం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని విద్యార్థినులు వాపోయారు.

చర్చలకు పిలిచి బెదిరింపులు

విద్యార్థినుల ఆందోళన విషయం తెలుసుకున్న ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శశిభూషణ్, ఏయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ కృష్ణమోహన్, ఇతర అధికారులు చర్చలకు పిలిచారు. అయితే సమస్యలు చెప్పేందుకు ముందుకువచ్చిన వారిని బెదిరించే ప్రయత్నం చేశారు. 'నీ పేరేంటి, ఏ బ్రాంచ్..' అంటూ గట్టిగా ప్రశ్నించడంతో విద్యార్థినులు తమ ఇబ్బందులను చెప్పుకునేందుకు భయపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు బెదిరించే ప్రయత్నం చేయడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శశిభూషణ్ మాట్లాడుతూ విద్యార్థినులు ఇబ్బందులను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేవాడినన్నారు. వారి సమస్యలను కాగితంపై రాసి ఇవ్వాలని సూచించినట్టు చెప్పారు.

ఎట్టకేలకు రైళ్ల పునరుద్ధరణ

ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్,ఏప్రిల్ 2 : ట్రాక్ నిర్వహణ పనుల నేపథ్యంలో రెండు నెలలకు పైగా నిలిచిపోయిన పలు రైళ్లు తిరిగి అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. జనవరి 19 నుంచి విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్,29 నుంచి కాకినాడ పోర్టు-విశాఖ, రాయగడ-గుంటూరు రైళ్లతో పాటు మచిలీపట్నం-విశాఖపట్నం రైళ్లు నిలిపివేశారు. అప్పటి నుంచి విశాఖ, విజయవాడ మార్గంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు కాకినాడ, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు సోమవారం సాయంత్రం నుంచి అనకాపల్లి పట్టణ వాసులకు అందుబాటులోకి వచ్చాయి. మంగళవారం నుంచి రాయగడ రైలు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనకాపల్లి రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి నుంచి ప్రతి రోజూ చిరుద్యోగులు,వ్యాపారులు, విద్యార్థులు, ఫైనాన్సర్లతో పాటు వివిధ పనులపై విశాఖ వెళ్లే వారి సంఖ్య భారీగా ఉంటుంది. వీరికి కాకినాడ పోర్టు నుంచి విశాఖ వెళ్లే రైలు అందుబాటులో ఉండేది. రెండు నెలలుగా ఇబ్బందులు పడిన వీరికి ఈ రైలు మళ్లీ అందుబాటులోకి రావడంతో పాటు రాయగడ, సింహాద్రి కూడా తిరుగుతుండడంతో ప్రయాణ ఇక్కట్లు తప్పాయి. ఇంకా మచిలీపట్నం- విశాఖపట్నం రైలు పట్టాలు ఎక్కాల్సి ఉందని స్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్ తెలిపారు.

దువ్వాడ మీదుగా హౌరా, యశ్వంత్‌పూర్ ప్రత్యేక ఏసీ రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 2: దువ్వాడ మీదుగా హౌరా, యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక ఏసీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 02863 నంబరు గల రైలు ఈనెల 4, 11న (ప్రతి గురువారం) మధ్యాహ్నం 12.40 గంటలకు హౌరాలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 2.43 గంటలకు దువ్వాడ, ఆదేరోజు అర్ధరాత్రి 12.15 గంటలకు (తెల్లవారితే శనివారం) యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02864 నంబరు గల రైలు ఈనెల 6,13న (ప్రతి శనివారం) ఉదయం 5.00 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా చేరుతుంది.

వెయిట్ లిఫ్టింగ్‌లో మామిడిపాలెం విద్యార్థికి స్వర్ణ పతకం



దీనరాజును అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

తుమ్మపాల, ఏప్రిల్ 2: ఎన్టీఆర్ జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి వి. దీనరాజు బంగారు పతకం సాధించారు. అండర్-17 కేటగిరీలో 93 కిలోల విభాగంలో ఈ పతకం పొందాడు. ఈమేరకు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

9న అప్పన్న పందిరిరాట

సింహాచలం, ఏప్రిల్ 2: వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవం ఈనెల 9న పందిరిరాటతో మొదలు కానుంది. ఏటా చైత్రమాస శుక్లపక్ష దశమి నుంచి పూర్ణిమ వరకు స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు 9న ఉగాది నాడు మధ్యాహ్నం 4 గంటలకు పంచాంగ శ్రవణం, 5 గంటలకు స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవానికి పందిరి రాట ఉడుపు జరుపుతారు. 14న మేష సంక్రమణం, తమిళ సంవత్సరాది. 15న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గంగధార సమీప సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం చేస్తారు. 17న శ్రీరామనవమి, 18న మృత్సం గ్రహణం, అంకురారోపణంతో ఉత్సవాలు జరుగుతాయి. 19న కొట్నాల ఉత్సవం, ధ్వజారోహణం, ఎదురుసన్నాహము, రాత్రి 8 గంటలకు రథోత్సవం, 9.30 గంటలకు వార్షిక తిరు కల్యాణ మహోత్సవం. 21న ఉదయం వైదిక సదస్యం, సాయంత్రం వేద పండిత సదస్యం. 22న స్వామివారి మాస జయంతి, 23న పూర్ణాహుతి, అవబృదోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి మృగయోత్సవం (దొంగల దోపు), 24న వినోదోత్సవం (ఉంగరపు సేవ), రాత్రి శ్రీ పుష్పయాగం, 25న నమ్మాళ్వార్ తిరునక్షత్రం, 28న మణవాళ్ల మహామునుల తిరునక్షత్ర ఉత్సవం జరగనున్నాయి.

టెన్త్ మూల్యాంకనం కేంద్రాలు పరిశీలన



మూల్యాంకణాలను పరిశీలిస్తున్న విజయ్‌భాస్కర్

అనకాపల్లి టౌన్,ఏప్రిల్ 2 : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, ఏఎంఏఎ హైస్కూల్‌లో జరుగుతున్న పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని జోన్-1 ప్రాంతీయ విద్యా సంచాలకుడు విజయ్‌భాస్కర్ మంగళవారం పరిశీలించారు. మూడు కేంద్రాల్లో జరుగుతున్న మూల్యాంకనాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఉన్నారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగిపై చర్యలు



గత నెల 31న ధర్మశ్రీ ప్రచార సభలో పాల్గొన్న కోఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగి పిల్లా నూకరాజు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

రోలుగుంట మార్చి 2: వైసీపీ ఎన్నికల ప్రచారంలో రోలుగుంట పీఏసీఎస్ ఉద్యోగి పిల్లా నూకరాజుపై చర్యలకు రంగం సిద్ధమయింది. గత నెల 31న రోలుగుంట సాయిబాబా ఆలయ సమీపంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పిల్లా నూకరాజు పాల్గొనడమే కాకుండా ముందు వరుసలో కూర్చున్నారు. సమావేశంలో అతడు పాల్గొన్న ఫొటోలు, వీడియాలను టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు పంపించి, ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి రూపొందించిన నివేదికను ఆర్‌ఓ చిన్నికృష్ణకు పంపించామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్యామల మంగళవారం విలేకరులకు తెలిపారు. నివేదిక ఆధారంగా అతనిపై చర్యలు ఉంటాయని ఎన్నికల అధికారిణి తెలిపారు.

పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోని తాతారావు

పాయకరావుపేట, ఏప్రిల్ 2: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా విశాఖ నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ బోని తాతారావును ఆ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. తాతారావు కొంతకాలంగా పాయకరావుపేట నియోజకవర్గంలో పలు వైద్య శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి టికెట్ ఆశించినా దక్కకపోవడంతో జై సమైఖ్యాంధ్ర పార్టీ తరపున పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 1,279 ఓట్లు వచ్చాయి.

'సౌత్'లో కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యం

బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, ఏప్రిల్ 2 : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతు ఇస్తూ ఆయన గెలుపునకు కృషిచేస్తానని బ్రాహ్మణ కార్పొ రేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ప్రకటించారు. మంగళవారం ఆయన బీచ్ రోడ్డులోని తన కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గంలోని అనుచరులు, ఆత్మీయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గతంలో వైసీపీ బలోపేతానికి కృషిచేశానని, పార్టీ కోసం సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేశానన్నారు. కానీ తనకు జగన్ మాట ఇచ్చి, తప్పారన్నారు. అందుకే వైసీపీకి రాజీనామా చేశానన్నారు. త్వరలో తెలు గుదేశం పార్టీలో చేరతానన్నారు. ఈ ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ గెలుపునకు కృషిచేస్తానన్నారు.

దర్జాగా అక్రమ నిర్మాణాలు.. పట్టని అధికారులు



చింతలవీధి గ్రామ కంఠం భూమిలో చేపడుతున్న మరో అక్రమ నిర్మాణం

- చింతలవీధి పంచాయతీలో రోజురోజుకూ పెరుగుతున్న ఆక్రమణలు
- జాతీయ రహదారి రావడంతో ఆస్తులకు పెరిగిన గిరాకీ
- వైసీపీ నాయకుల అండదండలతోనే రెచ్చిపోతున్న కబ్జాదారులు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

ఆక్రమణదారులు బరి తెగిస్తున్నారు. ఎంతలా అంటే..? ఏకంగా పంచాయతీ కార్యాలయం ఎదురుగానే ఖాళీ స్థలాలు ఆక్రమించి భవన నిర్మాణాలు చేపట్టేస్తున్నారు. కళ్లెదురుగానే ప్రభుత్వ ఆస్తులు చేజారిపోతున్నా.. తమ పనికాదులే అన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు. స్పందనలో సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తున్నా కబ్జాదారులు, అధికారుల్లో కనీసం చలనం లేకపోవడం మరో విశేషం

పాడేరు రూరల్, ఏప్రిల్ 2: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మండలంలోని చింతలవీధి పంచాయతీలో రోజురోజుకూ అక్రమ నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. వైసీపీ నాయకుల అండదండలతో రెవెన్యూ అధికారులను గుప్పెట్లో పెట్టుకొని ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఎల్‌పీసీలు సంపాదించుకున్న కొంత మంది గ్రామ కంఠం భూములను ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారు.

పాడేరు జిల్లా కేంద్రం కావడం, చింతవీధి గ్రామం నుంచి హైవే నిర్మాణం చేపట్టడంతో ఈ ప్రాంతంలో భూములకు గిరాకీ పెరిగింది. దీంతో గ్రామ కంఠం భూములపై కబ్జాదారుల కన్ను పడింది. దీంతో వైసీపీ నాయకుల అండతో గ్రామానికి చెందిన కిముడు రాము, ఏకంగా పంచాయతీ సర్పంచ్ తనయుడు వంతాల నరేష్ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్టు రెవెన్యూ అధికారులు మూడు సార్లు ఫిర్యాదు చేశామని గ్రామస్థులు తెలిపారు. వారు స్పందించకపోవడంతో పాత కలెక్టర్ సుమిత్ కుమార్‌కు, ప్రస్తుత జిల్లా కలెక్టర్ విజయ సునీతకు ఈ నిర్మాణాలపై వినతులు అందించామన్నారు. ప్రస్తుత కలెక్టర్ విజయ సునీత వినతిపత్రం అందించిన వెంటనే స్పందించి రెవెన్యూ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి విచారణ చేయించి నిర్మాణాలను నిలుపు చేయించారని గ్రామస్థులు చెప్పారు. అయితే వారం, పది రోజులు పనులు నిలిపిన నిర్మాణదారులు వైసీపీ ముఖ్యనాయకుల అండదండలతో ప్రస్తుతం పనులను ప్రారంభించారని మరలా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో స్పందించి గ్రామ కంఠం భూముల్లో చేపడుతున్న అక్రమ కట్టడాలను నిలుపుచేయాలని డిమండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు స్పష్టం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ టి.కల్యాణ్ చక్రవర్తిని వివరణ కోరగా స్పందనలో వినతులు అందించారన్నారు. ఎన్నికల హడావిడితో విచారణలో జాప్యం జరుగుతున్నదని చెప్పారు.



చింతలవీధి పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయం ఎదురుగానే గ్రామ కంఠం భూమిలో అక్రమ నిర్మాణం చేపడుతున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స, పక్కన నాయకులు

జీవో నంబర్-3పై విచారణకు పూర్తిస్థాయి జడ్జిలను నియమించాలి

పాడేరు రూరల్, ఏప్రిల్ 2: ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాల్లో శతశాతం రిజర్వేషన్ కల్పించే జీవో నంబరు-3పై ఆదివాసీ గిరిజన సంఘం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ విచారణకు పూర్తి స్థాయి జడ్జిలను నియమించాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స కోరారు. గిరిజన సంఘం భవనం వద్ద మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో-3ను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గిరిజన సంఘం సవాల్ చేస్తూ 2020 జూన్ 30న రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసినట్టు చెప్పారు. దీన్ని స్వీకరించిన కోర్టు ఐదుగురు జడ్జిలతో కూడిన బెంచ్‌కు సిఫారసు చేసిందన్నారు. ఇప్పటికే రెండుసార్లు విచారణకు వచ్చినప్పటికీ, పూర్తి స్థాయి జడ్జిలు లేరంటూ సుప్రీం కోర్టు విచారణ నిర్వహించకుండా వాయిదాలు వేస్తున్నదన్నారు. బుధవారం విచారణకు వస్తున్న నేపథ్యంలో పూర్తి స్థాయి జడ్జిలను నియమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మానపడాల్, జిల్లా కమిటీ సభ్యులు కోటిబాబు, సంకయ్య పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి



సమావేశంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు

జి.మాడుగుల, ఏప్రిల్ 2: పాడేరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి కిల్లు వెంకట రమేశ్‌నాయుడు గెలుపునకు కృషి చేస్తామని టీడీపీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, కూటమిలో ఉన్న ఆశావాహులు ఏకతాటిపై వచ్చి కార్యకర్తలకు కలుపుకొని పోవాలని, తద్వారా ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి పార్టీలో సముచిత స్థానం కల్పించాలని విన్నవించారు. ఈ సూమావేశంలో పార్టీ నేతలు ఎం.లక్ష్మయ్య, క్రిష్ణమూర్తి, ఎల్.బాలయ్యదొర, అప్పారావు, పిన్నయ్యదొర, ఎం.నారాయణరాజు, బి.బాబురావు, బాలయ్య, కొండబాబు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు

చింతపల్లి, ఏప్రిల్ 2: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరరావు తెలిపారు. మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరంలో ఆప్టోమెట్రిస్టు గాలి జగన్ కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో ఐటీడీఏ ఏర్పాటు చేసిన దృష్టి ఐకేర్‌లో ప్రతిరోజు కంటి పరీక్షలు జరుగుతాయన్నారు. దృష్టి లోపంతో బాధపడుతున్న బాధితులకు శస్త్రచికిత్సకు విశాఖపట్నం పంపించేందుకు ఈశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. శిబిరానికి హాజరైన బాధితుల్లో 21మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశామన్నారు. బాధితులను ప్రత్యేక వాహనంలో జిల్లా కంటి ఆస్పత్రికి పంపించామన్నారు. రోగులకు ఉచితంగా శస్త్రచికిత్స చేయడంతోపాటూ వసతి, భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్టోమెటిస్టు జగన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సన్యాసిరావు సేవలు మరువలేం



ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సన్యాసిరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గూడెంకొత్తవీధి, మార్చి 2: గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుడుగా రీమల సన్యాసిరావు అందించిన సేవలు మరువలేమని పీజీ హెచ్‌ఎం పాంగి పల్లవి అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సన్యాసిరావుకు మంగళవారం సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ టీచర్‌గా, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులుగా విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు సన్యాసిరావు ఎనలేని కృషి చేశారన్నారు. విద్యార్థులతో మంచి స్నేహ సంబంధాలు కలిగి ఉండేవారన్నారు. ఉద్యోగ విరమణతో పాఠశాలకు దూరం కావడం బాధగా ఉన్నప్పటికీ, ఆయన శేషజీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్టీవో చల్లంగి లక్ష్మణరావు, ఎంఈవో రామన్న, చింతపల్లి జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, గిరిజన ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంఘం నేతలు ముక్కలి గణేశ్వరరావు, పలాసి కృష్ణారావు, జంపరంగి ప్రసాద్, యూవీ గిరి, కుడుముల వెంకటరమణ, దేపూరి శశి కుమార్, పీజీ హెచ్‌ఎం యు.చిన్నయ్యపడాల్, రిటైర్డ్ పీజీ హెచ్‌ఎం వి.నారాయణరావు పాల్గొన్నారు.

పింఛన్లలో లబ్ధి కోసమే వైసీపీ రాజకీయం

- కాంట్రాక్టర్లు, బినామీల ఖాతాలకు పింఛన్ సొమ్ము
- గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పాడేరు రూరల్, ఏప్రిల్ 2: పింఛన్ల పంపిణీ విషయంలో రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ ప్రజలను మభ్యపెడుతున్నదని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది వలంటీర్లు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి వైసీపీ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొంటూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నుంచి వారిని ఎన్నికల కమిషనర్ తప్పిస్తూ ఆదేశాలు జారీ చేస్తే, కొంత మంది వైసీపీ నాయకులు ప్రతి పక్షాలపై బురద జల్లుతూ తప్పుడు ప్రచారాలను చేస్తున్నారన్నారు. వృద్ధులకు పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్మును వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు, బినామీలకు దోచిపెట్టి ఖజానా ఖాళీ చేసిందన్నారు. దాన్ని కప్పిపుచ్చుకొనేందుకు తనదైన తరహాలో తప్పుడు ప్రచారాలకు తెరలేపిందన్నారు. రాష్ట్రంలో 1.65 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, వారంతా 60 లక్షల మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయడం కష్టమైన పని కాదని పేర్కొన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే సచివాలయం వద్ద పింఛన్ల పంపిణీకి వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిం దన్నారు. వైసీపీ కుట్రపూరిత లక్ష్యం వల్లే పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారు తప్పితే, ప్రతిపక్షాలు వల్ల కాదని స్పష్టం చేశారు. అతని వెంట నాయకులు పి.రవికుమార్, సల్లా రామకృష్ణ, కూడా కృష్ణారావు, ఆర్.పాపిటిరాజు ఉన్నారు.

వ్యాధుల అదుపునకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 2: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా ఆదేశించారు. మండలంలోని లబ్బూరు ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. అక్కడికి వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సకాలంలో సంపూర్ణ వైద్య సేవలు అందించాలని వైద్యులకు, వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే ఆశా డే సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎపిడమిక్ సీజన్‌లో వ్యాధులను అదుపు చేసేందుకు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించడంతో పాటు వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రసవాలకు ముందస్తుగానే గర్భిణులు ఆస్పత్రికి చేరాలని ఆయన సూచించారు. అందుకుగాను ఆశ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి కనబరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లబ్బూరు డాక్టర్ ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

15 వరకు నూతన ఓటరు నమోదు

చింతపల్లి, ఏప్రిల్ 2: నూతన ఓటరు నమోదు కార్యక్రమం ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నూతన ఓటర్లు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించడం జరిగిందన్నారు. 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవచ్చునన్నారు. అర్హులైన వ్యక్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫారం-6ను నింపి బీఎల్‌వోలకు అందజేస్తే ఓటు హక్కు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మార్పులు చేర్పులకు ఎటువంటి అవకాశం లేదన్నారు. అలాగే రెండు ఓట్లు కలిగి ఉంటే క్రిమినల్ కేసులు పెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రజలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చురుగ్గా బాదిపుట్టు రోడ్డు నిర్మాణం

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 2: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి నుంచి బాదిపుట్టు వరకు పక్కా రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పీఆర్ నిధులు రూ.2 కోట్లు వెచ్చించి సుమారు రెండు కిలోమీటర్ల పక్కా రహదారి పనులను చేపడుతున్నారు. ఆయా గ్రామాలకు పూర్తి స్థాయిలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు నిత్యం ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రహదారి పనులు మొదలు కావడంతో త్వరలో రవాణా కష్టాలు తీరనున్నాయి. ఈ రహదారి నిర్మాణం పనులు జరిగేందుకు కృషి చేసిన జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో పాటు నిధులు మంజూరు చేసిన గత జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌లకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి బోడకొండమ్మ జాతర

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని గూడెంకాలనీలో బోడకొండమ్మ సాంబారి జాతర గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అమ్మవారం ఆలయంలో జాతర పోస్టర్లను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో జాతర నాలుగు రోజులు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు జాతరను విజయవంతం చేయాలన్నారు.

ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలి

డుంబ్రిగుడ, ఏప్రిల్ 2: ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో జయ ఉమకును మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లకు బదులుగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్ల వద్ద వెళ్లి సామజిక పింఛన్లు పంపిణీ చేయాలని కోరామన్నారు. వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీపై వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని వారు హితవు పలికారు. అరకు పార్లమెంట్ ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు కమ్మిడి సుబ్బారావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ ఎంపీపీ దన్నెరావు, మాజీ సర్పంచ్ వెంకటరావు, బీజేపీ నాయకుడు గంగాధర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అవస్థలు

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు నిత్యం సభలు, సమావేశాలో చెప్పే మాటలివి. అయితే గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ ప్రకటనలకు వాస్తవ పరిస్థితికి పొంతన లేకుండా పోయింది. పథకంలో భాగంగా ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు జరిపినా.. నిధుల లేమితో ఎక్కడి పనులక్కడే నిలిచిపోయి... అసంపూర్తి భవనాలే దర్శనమిస్తున్నాయి.

దాదాపుగా ఏజెన్సీ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ గూడెంకొత్తవీధి మండలం, పంచాయతీ పరిధి పెదగ్రహారం గ్రామంలోనూ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రెండేళ్లుగా భవన నిర్మాణాలు మొండిగోడలకే పరిమితమయ్యాయి. నూతన భవనం అందుబాటులోకి రాకపోవడంతో ప్రైవేటు ఇంటి వరండాలోనే అంగన్‌వాడీ కార్యకర్త చిన్నారులకు విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అందించాల్సిన పరిసితులు నెలకొన్నాయి. పెదగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో 30 మంది చిన్నారులున్నారు. ఈ కేంద్రానికి శాశ్వత భవనంలేదు. కేంద్రం నిర్వహణకు అనువైన అద్దె భవనం కూడా అందుబాటులోలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్త గ్రామంలోని ఓ ఇంటి వరండాలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. సరకులు భద్రపర్చుకునేందుకు కూడా సరైన భవనంలేదు. శాశ్వత భవనంలేక పోవడంతో వర్షాకాలం, చలికాలంలో చిన్నారుల అవస్థలు వర్ణనాతీతం. వర్షానికి గృహాలు కారిపోతుంటే ఒక ఇంటి నుంచి మరో ఇంటికి పరుగులు పెట్టాల్సివస్తున్నది. ఈపరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం ద్వారా గ్రామానికి శాశ్వత భవనం మంజూరయిందని ఐసీడీఎస్ అధికారులు ప్రకటించారు. దీంతో గిరిజనులు సంబరపడ్డారు. భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్థలం దానం చేశాడు. ఆరు నెలలు, ఏడాదిలోగా శాశ్వత భవనం అందుబాటులోకి వస్తుందని భావించారు. అయితే నేటికీ అందుబాటులోకి రాక తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదలకాకపోవడమే కారణం

పెదగ్రహారం అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి నిధులు విడుదలకాకపోవడంతో ఇప్పటికీ పూర్తికాలేదు. నాడు-నేడు పేజ్-2లో భాగంగా 2022లో పెదగ్రహారం గ్రామానికి అంగన్‌వాడీ భవనం మంజూరైంది. ఇందుకోసం రూ.14లక్షల మంజూరు చేస్తున్నట్టు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తొలి విడతగా రూ.ఆరు లక్షలు మంజూరు చేయడంతో శ్లాబ్ లెవెల్ వరకు నిర్మాణాలు జరిగాయి. 2023 జనవరి నుంచి నేటివరకు మలివిడత బిల్లుల కోసం ఐసీడీఎస్ అధికారులు, కాంట్రాక్టర్ (గ్రామ కమిటీ) ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం పైసా విడుదల చేయలేదు. దీంతో చిన్నారులకు శాశ్వత భవనం అందుబాటులోకి రాకుండా పోయింది. ప్రస్తుతం ఎన్నిక కోడ్ అమల్లోకి రావడం వల్ల నిధులు విడుదలయ్యే అవకాశాలు లేవు. అంగన్‌వాడీ చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలోపెట్టుకుని అధికారులు మలివిడత నిధులు విడుదల చేసి, భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

అటు వృథా... ఇటు వ్యథ!

... 5వ పేజీ తరువాయి

నిర్వహణ 2015 చివరిలో నిధులు మంజూరు చేయగా 2016లో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో నిర్మాణ పనులు చేపట్టారు. రెండున్నరేళ్లు నిర్మాణాలు కొనసాగి 2020 నవంబరులో అన్ని హంగులతో పీహెచ్‌సీ వైద్యాధికారికి అప్పగించారు. అయితే గ్రామంలో అప్పటికే అంగన్‌వాడీ భవనం, సబ్ సెంటర్ భవనాలు ఉండడంతో ఈ భవనాన్ని వినియోగించిన దాఖలాలు లేవు. దీంతో దాని చుట్టూ తుప్పలు పెరిగి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ భవనాన్ని బర్త్ వెయిటింగ్ హాల్‌గా మార్చి వినియోగంలోకి తేవాలని పలువురు ఉన్నతాధికారులు వైద్యాధికారికి ఆదేశించినా చర్యలు చేపట్టలేదు. ఇలా ప్రతి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ హయాంలో మంజూరైన భవనాలకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించక వృథాగా వదిలేసింది. ఉన్నతాధికారులు స్పందించి చివరి దశలో ఉన్న భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌కౌంటర్‌తో అప్రమత్తమైన పోలీసులు

... 5వ పేజీ తరువాయి

మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ పరిణామం మన్యంపై పడే అవకాశం ఉందనే అభిప్రాయంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న మావోయిస్టులు ఇక్కడి అటవీ ప్రాంతానికి తరలివచ్చే అవకాశం ఉందనే భావనతో పోలీసులు అదనపు బలగాలతో ముమ్మర గాలింపులకు రంగం సిద్ధం చేశారు. ఎదురు కాల్పుల ఘటనతో మన్యంలో భారీ పోలీసు బలగాలు రంగంలోకి దిగుతున్నాయి.

సంక్షిప్తంగా..

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

పాడేరు రూరల్, ఏప్రిల్ 2: వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బూడిదే చిట్టిబాబు సూచించారు. లోచలిపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 8, 9వ తరగతుల విద్యార్థులకు మంగళవారం వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. సెలవు రోజుల్లో స్వగ్రామాలకు వెళ్లేటపుడు కుటుంబ సభ్యులు, గ్రామస్థులకు హక్కులపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు మేలుకొలుపు మాస పత్రికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమాఖ్య నాయకులు జి.రమేష్, వి.బాలరాజు, కె.సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

తూటంగిలో ఆరోగ్య సురక్ష శిబిరం

డుంబ్రిగుడ, ఏప్రిల్ 2: తూటంగి పంచాయతీ కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 200 మందికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ప్రత్యేక వైద్య నిపుణులు విజయ్‌కుమార్, వైద్యులు రాంబాబు, అంబిక వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శౌరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అరకు పార్లమెంట్ మైనార్టీ మోర్చ ఎన్నికల కోఆర్డినేటర్‌గా రవికుమార్



పాడేరు రూరల్, ఏప్రిల్ 2: అరకు పార్లమెంట్ బీజేపీ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియామకంపై పార్టీ నాయకులు పురందేశ్వరి, షేక్ బాజీకి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అరకు పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

రేపటి నుంచి నూకాంబిక జాతర

చింతపల్లి, ఏప్రిల్ 2: మండలంలోని గొందిపాకలు (చిట్రాళ్లగొప్పు) గ్రామదేవత నూకాంబిక జాతర ఈ నెల 4 నుంచి జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. మూడు రోజుల పాటు సాయంత్రం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి జాతరను విజయవంతం చేయాలని వారు కోరారు.

నర్సీపట్నంలో ఎంసెట్ ఉచిత శిక్షణ

చింతపల్లి, ఏప్రిల్ 2: నర్సీపట్నంలో ఉచితంగా ఎంసెట్ శిక్షణ ఏర్పాటు చేసినట్టు సాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వరి తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం అరుణ్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు కోచింగ్‌లో చేరవచ్చునన్నారు. సాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శిక్షణ జరుగుతుందని, విద్యార్థులు 9963407674, 9493295638 నంబర్లకు కాల్ చేయవచ్చునన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు

కొయ్యూరు, ఏప్రిల్ 2: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించినట్టు సీడీపీవో విజయ కుమారి తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీ నుంచి ఉదయం 8-12 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు తెరచి ఉంటాయని చెప్పారు. అలాగే మే 1 నుంచి 15వ తేదీ వరకు కార్యకర్తలకు, 15 నుంచి 31 వరకు ఆయాలకు (సహాయకులకు) వేసవి సెలవులు ప్రకటించినట్టు సీడీపీవో వివరించారు.

పంత్ X శ్రేయాస్

... 5వ పేజీ తరువాయి

విజయాలు సాధించి మంచి ఊపు మీదున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) బుధవారం జరిగే ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరాలనే లక్ష్యంతో ఉంది. కేకేఆర్ జట్టులో ఆల్‌రౌండర్ ఆండ్రి రసూల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అలాగే ఓపెనర్ ఫిల్ సాల్ట్‌తోపాటు సునీల్ నరైన్, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, వెంకటేష్ అయ్యర్, రణదీప్‌సింగ్, రింకు సింగ్‌తో బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. కాగా ఈ సీజన్‌లో అత్యధిక పారితోషకం (రూ.24.75 కోట్లు) అందుకుంటున్న ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ అదనపు బలం. అయితే ఇప్పటివరకూ రెండు మ్యాచ్‌లలో మిచెల్ స్టార్క్ ఒక వికెట్ కూడా పడగొట్టలేదు. ఏదేమైనా సీఎస్‌కేపై సాధించిన విజయం, హోమ్ గ్రౌండ్‌లో ఆడనుండడం ఢిల్లీ క్యాపిటల్స్‌కు, వరుస విజయాలు, ఆల్‌రౌండర్ రసూల్ ఫామ్‌లో ఉండడం కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కలిసివచ్చే అంశాలని చెప్పవచ్చు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు రిషబ్ పంత్, కోల్‌కతా నైట్ రైడర్స్‌కు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహిస్తున్నారు. మ్యాచ్ బుధవారం రాత్రి 7.30 గంటల నుంచి ప్రారంభం కానున్నది. అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. కాగా ఇరుజట్ల ఆటగాళ్లు మంగళవారం సాయంత్రం ముమ్మర సాధన చేశారు.

ముసుగు తొలగింది

... 5వ పేజీ తరువాయి

రాజీనామా చేసినవారు ఎన్నికల ప్రచారంలో కీలకపాత్ర పోషించకూడదని అధికారులు హెచ్చరించడం లేదు. అలా చేస్తే ఏ ఉద్యోగాలు రావని కూడా చెప్పడం లేదు. వారు కూడా అధికార పార్టీకి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారు.

ఇదీ అసలు కారణం?

కేంద్ర ఎన్నికల సంఘం మూడేళ్లకు పైబడిన అధికారులను ఆయా ప్రాంతాల నుంచి బదిలీ చేసినట్టే...గత నాలుగేళ్లుగా గ్రామాలు, వార్డుల్లో పనిచేస్తున్న వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కాకూడదని స్పష్టంచేసింది. ప్రతి నెలా వీరి ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు, పెన్షన్లు ఇస్తున్నందున ఓటర్లు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని, ఆ పనులు కూడా వారికి అప్పగించవద్దని ఆదేశించింది. ఏప్రిల్ ఒకటో నుంచి పింఛన్ల పంపిణీ బాధ్యతలు ఇవ్వవద్దని సూచించింది. దీనిని అధికార పార్టీ వైసీపీ జీర్ణించుకోలేకపోయింది. అసలు పింఛన్లు ఇవ్వడానికి నిధులు లేవనే విషయం దాచిపెట్టి, ప్రతిపక్ష పార్టీలు కుట్ర వల్లే ఇదంతా జరుగుతున్నదని దుష్ప్రచారం ప్రారంభించింది. పేదలు, వృద్ధులకు పింఛన్లు సకాలంలో ఇవ్వడం కష్టమేనని ప్రచారం ప్రారంభించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో బుధవారం నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి ఏర్పాట్లుచేసింది.